క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. శుక్రవారం మండల పరిధి గోనూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని బోనమ్మ దేవాలయం నుంచి సంత్‌లాల్ బసప్ప పొలం వరకు రూ.5 లక్షలు, బొడ్రాయి నుంచి హనుమాన్ దేవాలయం వరకు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, మున్నెప్ప, సత్యనారాయణ, చాకలి వెంకటయ్య, చంద్రప్ప, అనంత్‌రెడ్డి, ఆనంద్, మల్లికార్జున్, రాఘవేందర్, బాలప్ప, బిచ్చప్ప తదితరుల పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు



వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు అందరి సహకారం అవసరమని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రఫీ అన్నారు. శుక్రవారం మండల పరిధి బిచ్చాలలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి, వైద్య పరీక్షలు చేశారు. ఈ నెల 11నుంచి 24 వరకు 14 రోజుల పాటు ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి, రెండేళ్ల పైబడిన వారందరినీ పరీక్షించి, వ్యాధి గ్రస్తులను గుర్తించనున్నట్లు రఫీ వెల్లడించారు. అలా గుర్తించిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తామని వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9 వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



సీసీరోడ్డు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ పీరంపల్లి గ్రామ నాయకులు అన్నారు. శుక్రవారం మండల పరిధి పీరంపల్లిలో శివాలయం దగ్గర రూ.4 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శివాలయానికి సీసీరోడ్డు వేయాలని గ్రామస్తులు కొంతకాలంగా కోరుతున్నారని, రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జి.రమేష్, చిన్న అనంతయ్య, నక్క నర్సింహులు, బక్కని రాములు, గొల్ల రామకృష్ణ, సైదుపల్లి వెంకటయ్య, చాకలి మొగులయ్య, చంద్రయ్య, ఆనంద్, భీమయ్య, శ్రీశైలం, మొగులయ్య పాల్గొన్నారు.

జెండా మోసిన వారికి ప్రాధాన్యత

కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మారుతికిరణ్

పరిగి: పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం దక్కుతుందని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి, మోదీ గురించి వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయంపై.. ప్రజల పక్షాన ఉండి, పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి.. చేతల్లో వికృతి

అధ్వానంగా నిర్వహణ

- ఎండిపోతున్న మొక్కలు.. కరువైన ఆహ్లాదం

పెద్దేముల్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు మండలంలో అధ్వానంగా తయారయ్యాయి. పర్యవేక్షించే వారు లేక.. మొక్కల స్థానంలో మొదల్లే దర్శనమిస్తున్నాయి. ఇక హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా.. జీపీ నిధులతో మొక్కలు నాటారు. కానీ వాటికి నీరందించడంలో సంబంధిత బాధ్యులు విఫలమయ్యారు. ఫలితంగా ఆకులు రాలి, మోడువారిపోయాయి.

నీరు పోసేవారు లేరు

2020 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద మండల పరిధి 37 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. రెండేళ్ల వరకు వాటిని (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధుల ద్వారా పర్యవేక్షించి, అనంతరం జీపీలకు అప్పగించారు. స్థానిక పాలకులు, అధికారులు వాటి ఆలనా పాలనా చూడాల్సి ఉంది. కానీ సర్పంచుల పదవీకాలం ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన కొలువుదీరింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. వనాల సంరక్షణ పూర్తిగా కొరవడింది. నీరు అందక మొక్కలు ఎండిపోతున్నాయి. మండల పరిధి కందనెల్లితండా పకృతి వనం తాండూరు–జహీరాబాద్ ప్రధాన రోడ్డుకు పక్కనే ఉంది. అందులోని మొక్కలు, చెట్లు పూర్తిగా పచ్చదనం కోల్పోయి, కాడలే మిగిలాయి.





కందనెల్లితండా పల్లె ప్రకృతి వనం (ఇన్‌సెట్లో) ఎండిన మొక్కలు

వీటిని చూసిన ప్రజలు.. కనీసం నీరు పోసేవారు కూడా లేరా అని వాపోతున్నారు.

ఒక్క మొక్కకు రూ.200లు

మండల పరిధి తాండూరు–జహీరాబాద్, తాండూరు–వికారాబాద్, తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారుల పక్కన నాటిన మొక్కలు ప్రస్తుత ఎండలకు మాడిపోతున్నాయి. మూడు నెలల క్రితం ఒక్కో మొక్కకు రూ.200లు జీపీ నిధుల ద్వారా ఖరీదు చేసి, రోడ్ల పక్కన నాటారు. ఇప్పుడు అందులో 50శాతం మొక్కలు కూడా కనబడటం లేదు. దీనికి కారణం పల్లె అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనని తెలుస్తోంది. ఇప్పటికైనా.. మండల అధికారులు స్పందించి హరితహారం, పల్లెప్రకృతి వనాలపై దృష్టి సారించి, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై.. ఎంపీడీఓ జర్నప్పను వివరణ కోరగా.. పల్లె ప్రకృతి, రోడ్ల పక్కన నాటిన మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి, నిత్యం నీరు పోసేలా చూస్తామని వెల్లడించారు. అయినా నిర్లక్ష్యం చేస్తే.. వారిపై చర్యలు తప్పవన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఈఓ వెంకటయ్య



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న విద్యాధికారి

తాండూరు రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. తాండూరు పట్టణం, రూరల్‌లో కలిపి 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, పట్టణంలో 8 పాఠశాలలు, మండలంలో 2 కేంద్రాల్లో ఉన్నాయని వివరించారు. మరో నాలుగు ప్రైవేట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొత్తం 2,416 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. ఇందులో బాలురు 1,172, బాలికలు–1,244 మంది ఉన్నారని చెప్పారు. 147 ఇన్విజిలేటర్లు, 14 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, మరో 14 మంది చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని, విద్యార్థులు ఆందోళన చెందకుండా.. ధైర్యంగా పరీక్ష రాయాలని సూచించారు.

ఘనంగా ఎంపీపీ జన్మదినం



శ్రీవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ

కొడంగల్: ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి, మహాదేవుని, మైశమ్మ తండాలోని మైసమ్మ ఆలయంలో ఎంపీపీ పూజలు చేశారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థా చారీ, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, నందారం శ్రీనివాస్, బాలప్రకాశ్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మహిళాదినోత్సవం



కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అందుకు విద్యావంతులైన వారు.. మహిళలు, బాలికల అభ్యున్నతికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ప్రింటర్

పాస్‌బుక్కుల్లో వివరాల నమోదుకు ఆటంకం

కొత్తూరు: కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి విభాగంలో పట్టాదారు పాస్‌బుక్కుల్లో వివరాలు నమోదు చేసే ప్రింటర్ ఐదు నెలలుగా పనిచేయడం లేదు. ఫలితంగా కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారికి పొలాల వివరాలు పాస్‌బుక్కుల్లో నమోదు కావడం లేదు. దీంతో భూములు కొనుగోలు చేసిన వారు.. వాటి వివరాలను డాక్యుమెంట్, ఆన్‌లైన్‌ల్లోనే సరి చూసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ప్రింటర్ పనిచేయడం లేదనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. మరో నాలుగు రోజుల్లో ప్రింటర్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: పులుసుమామిడి గ్రామంలో శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాత ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం తక్కువగా ఉండటంతో బోరుమోటార్లు సక్రమంగా పనిచేయక.. పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే 100 కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్ రెడ్డి, జహంగీర్, మహిపాల్ రెడ్డి, బలవంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో మొదటి బహుమతి

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఘనత

చేవెళ్ల: జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మొదటి బహుమతి దక్కింది. రామచంద్రపురంలోని సాయిగార్డెన్‌లో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక పాఠశాలకు చెందిన ఎనిమిదోతరగతి విద్యార్థి జావిద్ మొదటి బహుమతికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థికి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాత

నవాబ్‌పేట: ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలని మమ్‌దాన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి సూచించారు. శుక్రవారం ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సాయి ఇంటర్‌నెట్ వికారాబాద్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్, జామెంట్రి బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్షలకు విద్యార్థులు అన్ని విధాలా సన్నద్ధమయ్యారని, ఉన్నత గ్రేడ్‌లతో పాసవుతారన్నారు. ఈ సందర్భంగా దాత అశోక్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైపాల్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, ఇందిర, హేమలత, వరలక్ష్మి, స్వాతి, రాములు, ఆర్.అశోక్, అరవింద్, సమీర్, ఎనోష్, దశరథ్, అభిలాష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

కుల్కచర్ల: మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్లమ్మ తల్లికి బోనమెత్తారు. డప్పుచప్పుళ్ల మధ్య, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎల్లమ్మకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ అనురాధ, గౌడ సంఘం నాయకులు మల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, నరేష్ గౌడ్, ఎ.రాములు, నర్సింహులు, యాదయ్య గౌడ్, వెంకట్రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నారుమడే కీలకం

పెరగని దిగుబడులు

- ఇబ్బందుల్లో కూరగాయల సాగు రైతులు

షాబాద్: సాగు విస్తీర్ణం పెరిగినా కూరగాయల దిగుబడులు ఆశించిన మేరకు పెరగడం లేదు. ఇందుకు కారణం నారుమళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమేనని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతుల పరిస్థితి ఇలాగే ఉన్నట్లు సమాచారం. పంట దిగుబడి పెరుగుదలకు పాటించాల్సిన పద్ధతులను చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి అశోక్ వివరించారు.

నేలలు మధ్యస్థంగా ఉండాలి..

నారుమడిగా చేసుకునే భూమిని లోతుగా దున్నాలి. నేలల బరువు మధ్యస్థంగా, నారుమడి పొడవు 150, వెడల్పు 120 సెంటీ మీటర్ల లోపు ఉండాలి. నులి పురుగులు రాకుండా నేలపై కార్బొఫ్యూరాన్ గుళికలు వేయాలి. ప్రతి 10 చదరపు మీటర్లకు 40 నుంచి 50 కిలోల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. నారుమళ్లలో నారుకుళ్లు తెగులు వస్తుంది. ఇది రాకుండా ఉండేందుకు 0.1 శాతం క్యాప్టాన్ లేదా ఫార్మాల్డిహైడ్ 25 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి నేలను శుద్ధి చేయాలి. మొక్కలను చెద, గొంగళి పురుగులు ఆశిస్తాయి. విత్తనాలు విత్తడానికి ముందు క్లోరిపైరిపాస్ 2 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి నారుమడి నేలను తడపాలి. రెండు నారుమళ్ల మధ్య, చుట్టూ 8 నుంచి 10 సెంటీ మీటర్ల లోతు, 30 సెంటీ మీటర్ల వెడల్పుతో కాలువలు తీసి మురుగు నీరు పారేలా చూసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి...

నారుమడిలో మొక్కలను తరచూ రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. మలాథియాన్ 2 మిల్లీ లీటర్ లేక ఎండోసల్ఫాన్ 2 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేయాలి. మొక్కలు బలహీనంగా ఉంటే ఒక శాతం యూరియా ద్రావణం స్ప్రే చేయాలి. ఎప్పటికప్పుడు కలుపు తీయాలి. నారు తీయడానికి ముందు నీరు పెట్టడం తగ్గించాలి. సాయంత్రం వేళలో నాటు వేస్తే మంచిది.



నాగర్‌గూడలో కూరగాయల నారుమడి

విత్తన శుద్ధి తప్పనిసరి..



విత్తే ముందు క్యాప్టాన్ లేదా థైరామ్ 3 గ్రాములను కిలో విత్తనానికి కలిపి తప్పనిసరిగా శుద్ధి చేయాలి. టమాటాలో విత్తనాన్ని అజోస్పైరిల్లమ్ వంటి బ్యాక్టీరియల్ కల్చర్‌తో కలిపి వేయాలి. ఎత్తు మడులపై చేతివేళ్లతో లేదా కర్రతో దగ్గరగా గీతలు గీసుకోవాలి. విత్తనాలను ఇసుకతో కలిపి వాటిలో పలుచగా చల్లాలి. వెంటనే వరిగడ్డితో కప్పితే మొలక శాతం పెరగడంతో పాటు త్వరగా మొలకెత్తుతాయి.

– అశోక్, ఉద్యానశాఖ అధికారి, చేవెళ్ల డివిజన్

తరగతి గదుల్లోనే విజ్ఞానం

ఏబీవీపీ కన్వీనర్ సూర్యప్రకాశ్

చేవెళ్ల: విద్యార్థులు ఎక్కువ సమయం తరగతి గదుల్లో ఉంటేనే విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేవెళ్లలోని పలు కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో 'పరిసర్ చలో అభియాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరైతే విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల మధ్య మంచి స్నేహ బంధం ఏర్పడితే భవిష్యత్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, ప్రవీణ్, ధీరజ్, విజయ్, ప్రణయ్, నితీష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

షెడ్డు నిర్మాణాన్ని నిలిపేయాలని వినతి

మొయినాబాద్: చెరువు శిఖంలో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులను నిలిపేయాలని చిన్నమంగళారం గ్రామస్థులు మండల తహసీల్దార్ కార్యాలయంలో గౌతమ్‌కుమార్‌కు విన్నవించారు. రంగారెడ్డి జిల్లా చిన్నమంగళారం రెవెన్యూలోని సర్వే నంబర్లు 132, 133, 134లో గ్రామ సమీపంలో చిన్న చెరువు శిఖం పట్టా భూమి ఉందని, అందులో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి నిర్మాణపనులు అడ్డుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అవిశేపేట ఆంజనేయులుగౌడ్, ఎ.రాములు, ఎం వెంకటేశ్, బి.శంకర్, రాములు, కృష్ణ, భిక్షపతి, జహంగీర్, బాల్‌రాజ్, అంజద్, శివశంకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన

మర్పల్లి: జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించిందని జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో బీజేపీ చేవెళ్ల లోకసభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో 'కొండా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి నిరుద్యోగ యువత భారీగా తరలి వచ్చారు. ఇందులో స్విగ్గి, తదితర సంస్థల ప్రతినిధులు, సిబ్బంది యువతకు సలహాలు, సూచనలు ఇచ్చారు. తగిన అర్హత ఉంటే.. నెలకు రూ.15 వేల నుంచి 40 వేల వరకు సంపాదించుకోవచ్చునని తెలిపారు. అంతకు ముందు బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబీకులకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మణ్, రామచంద్ర, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళను ప్రాంభిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి రాములు

అడుగంటిన ఆశలు

తగ్గిన భూగర్భజలాలు

- ఎండుతున్న పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

దోమ: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. చెరువులు, కుంటల్లో జలకళ తగ్గగా.. బోరు బావులు పూర్తిగా అడుగంటి పోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలకు.. సరిపడా నీరందక ఎండుముఖం పడుతున్నాయని వాపోతున్నారు. పెట్టుబడులు పోను, లాభాలు వస్తాయనుకున్న వారి ఆశలపై, అసలుకే ఎసరు తెస్తున్న పరిస్థితిని చూసి కుంగిపోతున్నారు.

అసలుకే ఎసరు!

దోమ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో ఎక్కువ మంది రైతులు బోరు బావులపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. బొంపల్లి, బాస్‌పల్లి, మైలారం, మోత్కుర్, ఖమ్మంనాచారం, శివారెడ్డిపల్లి, రాకొండ, ఐనాపూర్, దాదాపూర్, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో ప్రస్తుత యాసంగిలో మొక్కజొన్న, వరిని సాగు చేశారు. అయితే ఈ సీజన్‌లో భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో సాగుకు నీరందడం లేదు. దీంతో పంటలు ఎండిపోవడం రైతులను కలవరపాటుకు గురిచేస్తుంది. అప్పులు తెచ్చి, వ్యవసాయం చేస్తే.. కనీసం అసలు కూడా వచ్చేలా లేదంటూ వాపోతున్నారు.



బాస్‌పల్లిలో ఎండిన మొక్కజొన్న పంట

పెట్టుబడి వచ్చేలా లేదు



రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. బోరు బావుల్లో నీరు తగ్గి, పంటకు నీరందక ఎండుముఖం పట్టింది. అప్పు తెచ్చి వ్యవసాయం చేశాను. కనీసం ఇప్పుడు పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి, తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

–కృష్ణయ్య, రైతు, బాస్‌పల్లి